పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరం

- జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

ఏరువాక కేంద్రం విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి అనూరాధ, అధికారులు

మోటకొండూర్, మార్చి 30 : నేల పరిరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు, ఏరువాక కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పంటల సాగు విషయంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మమత, ఏడీఏ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి సుజాత, ఏరువాక కేంద్రం అధికారులు వెంకటేశ్, సూరజ్, తాసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర, ఏఈఓలు సంధ్య, శివాణి, రమేశ్ పాల్గొన్నారు.

నేడు తుర్కపల్లికి రానున్న మాజీ సీఎం కేసీఆర్

తుర్కపల్లి, మార్చి 30 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆగి రైతులు, నాయకులతో మాట్లాడతారని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్షంతో సాగు నీరు అందక ఎండి పోయిన పంట చేలను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పేందుకు మాజీ సీఎం కేసీఆర్ సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాల్లో పర్యటించనున్నారు. అందులో భాగంగా ఎర్రవెల్లి నుంచి రోడ్డు మార్గాన సూర్యాపేటకు వెళ్లే క్రమంలో తుర్కపల్లి చౌరస్తా వద్ద ఆగి రైతులతో మాట్లాడనున్నారు. కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు అధిక సంఖ్యలో రావాలని ఆయన కోరారు.

ఘన స్వాగతానికి ఏర్పాట్లు

భువనగిరి అర్బన్, మార్చి 30 : జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలో ఎండిన పంటల పరిశీలనకు ఆదివారం వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో ఘన స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధమయ్యాయి. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని బీఆర్‌ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ.కిరణ్‌కుమార్, జనగాం పాండు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8.30 గంటలకు విచ్చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతోత్సవం పలికేందుకు నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మాక్ పోలింగ్

ఆలేరు రూరల్ : కొలనుపాక జడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూరు(ఎం), మార్చి 30 : లోక్‌సభ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ప్రజాస్వామ్యం, ఎన్నికల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దొడ్డి స్వామి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, వెంకట నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, షమీమ్, శీరీష, రవీందర్, కలీం, వెంకటేశం పాల్గొన్నారు.

కొలనుపాక హైస్కూల్లో

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు పోలింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామచంద్రయ్య, ఉపాధ్యాయులు శ్రీధర్, రేష్మా, సైదా, విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని నాగినేనిపల్లి హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల అధికారులుగా, ఓటర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీసీఈఓ శోభారాణి

తుర్కపల్లి, మార్చి 30 : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ ఎన్. శోభారాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం తాగునీటి ఎద్దడి నివారణపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పైపులైన్లు లీకేజీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఏఈ సాయి, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని కొనసాగించాలి

- దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దయాకర్

బొమ్మలరామారం, మార్చి 30 : గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు కాశపాక దయాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన దళితుల హక్కుల పోరాట సమితి మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితులకు రాజ్యాంగం అందించిన హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అందుకోసం గ్రామ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సమితి మండల కన్వీనర్‌గా చిప్పల జయమ్మ, కార్యదర్శిగా నమిత ఎల్లయ్య, కోశాధికారిగా మైలారం నర్సింహ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల లింగస్వామి, అడగల రమేశ్, అన్నమైన వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రీస్కూల్ మెటీరియల్ ప్రదర్శన

గుండాల, మార్చి 30: మండలంలోని మాసాన్‌పల్లి, వస్తాకొండూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యాక్‌పాషా బేగం, షమీమ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సులువుగా బోధన చేసేలా, పిల్లలకు అర్థమయ్యేలా మెటీరియల్ తయారు చేసి అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వీరలక్ష్మి, రమ, గుల్‌జార్‌బీ, పద్మ పాల్గొన్నారు.

కేవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

భువనగిరి సిటీ, మార్చి 30 : పట్టణ కేంద్రంలోని బంజారాహిల్స్‌లో గల కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి (2024 –2025 సంవత్సరానికి) ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర విద్యాలయం ప్రధాన ఆచార్యులు ఎం.చంద్రమౌళి శనివారం ఒక ప్రటనలో తెలిపారు. తల్లిదండ్రులు ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పూర్తి వివరాలకు కేంద్రీయ విద్యాలయం భువనగిరి రీజినల్ ఆఫీస్, హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం ఘట్‌కేసర్ నందు పొందగలరు. https;//kvsonlina admission. kvs.gov.in నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసిన అధికారులు, ఐకేపీ సిబ్బంది

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే

2కే రన్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 30: ఓటరు చైతన్యం కోసం ఏప్రిల్ 2న నిర్వహించే 2కే రన్ కార్యక్రమంలో ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఓటు ప్రాముఖ్యతను తెలియజెప్పేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఉదయం 6 గంటలకు భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, తిరిగి జూనియర్ కాలేజీ వరకు 2కే రన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, భువనగిరి ఆర్‌డీఓ అమరేందర్, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ.కృష్ణన్, నోడల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మానవహారం

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఐకేపీ సిబ్బందితో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ. కృష్ణన్, అడిషనల్ పీడీ శ్రీనివాస్, డీపీఎం సునీల్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణన్

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ.కృష్ణన్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 30 : ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జిల్లాలో చేపట్టే ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ. కృష్ణన్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఐకేపీ అధికారులు, సీసీలు, మెప్మా, సెంటర్ల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రతి మండల కేంద్రంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నందున, రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల 15లోగా మొత్తం 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 ధర చెల్లించనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, అడిషనల్ పీడీ శ్రీనివాస్, డీపీఎం సునీల్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో జింక మృతి

భువనగిరి కలెక్టరేట్, మార్చి30 : వీధికుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన మండలంలోని వడాయిగూడెం గ్రామ సమీపంలోని నృసింహ అభయారణ్యం వద్ద శనివారం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వడాయిగూడెం గ్రామ సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాదాద్రి నృసింహ అభయారణ్యం వద్ద జింక ఫెన్సింగ్‌ను దాటి బయటకు వచ్చింది. వీధి కుక్కలు ఒక్కసారిగా జింకపై దాడి చేసి చంపివేశాయి. అటవీశాఖ అధికారులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. వైద్యాధికారులతో పరీక్షలు నిర్వహించి పాతిపెడతామని అధికారులు చెప్పారు.

జింక కళేబరం

క్యామ మల్లేశాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం) బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేశాన్ని సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

వలిగొండ, మార్చి 30 : జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న క్యామ మల్లేశంను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం భువనగిరిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వలిగొండ మండల నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమత నరేందర్‌రెడ్డి, పల్సం రమేశ్, కునపూరి కవిత, డేగల పాండరి, మాద శంకర్‌గౌడ్, డాక్టర్ వల్లమాల కృష్ణ పాల్గొన్నారు.

మల్లేశంకు సన్మానం

భువనగిరి సిటీ: పట్టణ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి మొదటిసారి వచ్చిన పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశంను బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కుతాడి సురేశ్, వల్లపు విజయ్, బట్రాజ్ ఆనంద్, నగరం నరేశ్, కృష్ణ పాల్గొన్నారు.

కురుమసంఘం మద్దతు

ఆత్మకూరు(ఎం), మార్చి 30 : భువనగిరి పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశాన్ని శనివారం భువనగిరిలో ఆత్మకూరు(ఎం) మండల కురుమసంఘం నాయకులు కలిసి సన్మానించారు. క్యామ మల్లేశానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా నాయకుడు కోరె భిక్షపతి, మండలాధ్యక్షుడు మజ్జిగ రాంబాబు, చెక్కిలి రవి, నాయకులు పాల్గొన్నారు.

మల్లేశంను కలిసిన నాయకులు

మోటకొండూర్ : భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను శనివారం బీఆర్‌ఎస్ మండల నాయకులు యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కలిసిన వారిలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సుధీర్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మల్లగౌరయ్య ఉన్నారు.

పుస్తెలతాడు అపహరణ కేసులో నిందితుడి అరెస్టు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 30 : మహిళ మెడలోంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ ఎం. ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ వి, సంతోష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. బొమ్మలరామారం మండలం పక్కీరుగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గంగదేవి సాగర్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మండలంలోని హన్మాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలి మెడలోంచి పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. కేసు దర్యాప్తులో భాగంగా అనంతారం చౌరస్తా వద్ద వాహన తనిఖీ చేస్తుండగా బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న సాగర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 4 తులాల బంగారు పుస్తెలతాడు, బైక్, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నట్లు, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 30 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిర్వహించే ఉపాధి సాంకేతిక శిక్షణ కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితితో కూడిన బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) బీకాం పాస్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్), ఆటో మొబైల్ టూ వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ (పదో తరగతి పాస్), ఎలక్ట్రిషన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్, సర్వీస్ (పదోతరగతి, ఐటీఐ పాస్ అయిన వారికి ప్రాధాన్యత) కోర్సులు నిర్వహించబడునని తెలిపారు. అర్హత గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్‌తో ఏప్రిల్ 15న ఉదయం 10 గంటలకు స్వామి రామానంద గ్రామీణ సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆత్మకూర్ఎం : పరీక్షలు పూర్తి కావడంతో ఇండ్లకు వెళ్తున్న కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులు

పదో తరగతి పరీక్షలు పూర్తి

భువనగిరి సిటీ, మార్చి 30 : యాదాద్రి భువనగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు శనివారం సజావుగా ముగిశాయి. పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 9,130కి గాను 9,103, ప్రైవేట్ వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు ఆరుగురికి ఐదుగురు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి మూడు పరీక్ష కేంద్రాలు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ మూడు పరీక్ష కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 13 పరీక్ష కేంద్రాలు, తాసీల్దార్లు, ఎంపీడీఓలు 10 పరీక్ష కేంద్రాలు సందర్శించినట్టు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు.

‘ఏప్రిల్ 14న భీమ్ యాత్రను విజయవంతం చేయండి ’

భువనగిరి సిటీ, మార్చి 30 : మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 14న జరిగే భీమ్ యాత్రను విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ కోరారు. శనివారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేశ్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవనంలో ఏర్పాటు చేసిన యువజన, విద్యార్థి సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వనం రాజు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పస్తవుల అభిలాష్, ఎమ్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి హరీశ్‌మాదిగ, యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పడిగల ప్రదీప్, బీజేవైఎమ్ పట్టణ అధ్యక్షుడు కనుకుంట్ల రమేశ్ పాల్గొన్నారు.

కొబ్బరితోట దగ్ధం

రామన్నపేట, మార్చి30: మండలంలోని లక్ష్మాపురం గ్రామ శివారులో శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 35 ఎకరాల్లోని కొబ్బరి, మామిడి తోటను శిరిషాల యాదగిరి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. శనివారం సాయంత్రం గుర్తు తెలియని వారు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి 6ఎకరాల్లో కొబ్బరి, మామిడి చెట్లతో పాటు డ్రిప్, నీటి పైపులు దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 3లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

విరాళం అందిస్తున్న శాసన మండలి ప్రొటెం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి

వైభవంగా స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట, మార్చి 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి నిత్య తిరుకల్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవసేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం వేళలో స్వామివారికి గరుఢవాహనంపై, అమ్మవారికి తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి వేళలో స్వామివారి తిరువారాధన చేట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 22 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానకు రూ. 52,76,501 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఆలయానికి రూ.11 లక్షల విరాళం అందించిన శాసన మండలి ప్రొటెం చైర్మన్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి శాసన మండలి ప్రొటెం చైర్మన్ వి. భూపాల్‌రెడ్డి రూ. 11 లక్షలు విరాళంగా సమర్పించారు. శనివారం శాసన మండలి మాజీ చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం స్వల్ప అనారోగ్యంతో బాధపడుతూ స్వామివారి మొక్కుకున్నానని, మొక్కు చెల్లించుకునేందుకు వచ్చి విరాళం సమర్పించినట్లు వెల్లడించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వేంకటేశ్వర్‌రెడ్డి వారిని శాలువతో సన్మానించి, స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన వెంట ప్రొటెం చైర్మన్ బంధుమిత్రులు వి. రాజేశ్వర్‌రెడ్డి, తులసీరెడ్డి, మల్లిక్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్

మోత్కూరు, మార్చి 30: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎండిన వరి పంటల పరిశీలన కోసం ఆదివారం అర్వపల్లికి వస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ కోరారు. శనివారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పచ్చని మగాణిగా చేసి రైతుల కండ్లలో ఆనందాన్ని నింపిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న నీళ్లను వాడుకోవడం చేతకాక రైతుల పంట పొలాలు ఎండబెడుతున్నదన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకుబ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బొడ్డుపల్లి కల్యాణ్‌చక్రవర్తి, నాయకులు పిచ్చయ్య, శ్రీను, అనిల్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

రామన్నపేట ఇన్‌చార్జి ఎంపీపీగా ఉపేందర్

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన నాగటి ఉపేందర్

రామన్నపేట, మార్చి 30: రామన్నపేట ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి ఈ నెల 28న తన పదవికి రాజీనామ చేశారు. దాంతో జడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ నాగటి ఉపేందర్‌కు ఇన్‌చార్జి బాధ్యలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఏప్రిల్ 8న ఎంపీపీ ఎన్నిక

రామన్నపేట ఎంపీపీ ఎన్నికను ఏప్రిల్ 8న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పి. పార్థసారధి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం నిర్వహించే ప్రత్యేక సమావేశ నోటీసును ఏప్రిల్ 4న సభ్యులకు అందించాలని పేర్కొన్నారు. ఏదేని కారణం వల్ల ఆరోజు ఎన్నిక జరుగనట్లయితే మరుసటిరోజు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చౌటుప్పల్‌రూరల్, మార్చి 30 : చౌటుప్పల్ మండలం ఎల్లగిరి క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన గుర్రాల సుదర్శన్‌కు గాయాలయ్యాయి. సుదర్శన్ రోడ్డు దాటుతున్న సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. క్షతగాత్రుడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటకొండూర్‌లో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చామల ఉదయ్‌చందర్‌రెడ్డి

మోటకొండూర్, మార్చి 30 : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, చామల ఫౌండేషన్ చైర్మన్ చామల ఉదయ్‌చందర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్గనైజర్ చామల భానుచందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు బురాన్, ముస్లిం పెద్దలు మోసాబ్, అంకుశ్, చాంద్‌పాషా, జహంగీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గుండాల ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం మండల కార్యదర్శి రాజు

గుండాల, మార్చి 30: విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓ దేవికపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట విలేకరుతో మాట్లాడారు. ఎంపీడీఓ సమయపాలన పాటించక పోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కూడా సక్రమంగా సాగడం లేదన్నారు.